# ది గెస్ట్



మల్లాది వెంకట కృష్ణమూర్తి

## THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

## (గత సంచిక తరువాయి)

### 4

బెనర్జీ మిత్ర సముదాయలోని మరో ముఖ్య వ్యక్తి పేరు దేవ్‌సేన్. డాక్టర్ వృత్తి. బెనర్జీకి అరుదుగా ఎప్పుడయినా సుఖవ్యాధులలాంటివి తగులుకుంటే ట్రీట్ మెంట్ ఇచ్చేది అతనే. అబార్షన్స్ ఏర్పాట్లు కూడా అతనే చేస్తుంటాడు.

దేవ్‌సేన్ దారిద్ర్యంలో పుట్టి పెరిగాడు. అందుచేత అతనికి డబ్బు విలువ బాగా తెలుసు. దాన్ని ఎలా సంపాదించాలో కూడా తెలుసు. ఖర్చు చేయడం మాత్రం తెలీదు. అతని దగ్గరికి వచ్చే పేషెంట్లలో ధనవంతులు మాత్రమే ఉంటారు.

దేవ్‌సేన్ కేవలం డాక్టర్‌గా ఫీజ్ రూపంలోనే సంపాదిస్తున్నాడంటే తప్పు. వైద్యవృత్తిలోని కొన్ని సౌకర్యాల వల్ల అనేక విధాలుగా సంపాదిస్తూంటాడు.

అతను ప్రిస్క్రైబ్ చేసిన మందులనీ వంద గజాల దూరంలో ఉన్న ఓ మందుల షాపులోనే కొనాలి. ఆ అమ్మకాల మీద అతనికి లాభంలో భాగం ఉంటుంది. కాబట్టి, అవసరం లేకపోయినా ఖరీదయిన మందులని రాస్తుంటాడు.

ఓ పేథలాజికల్ లేబరేటరీలో కూడా ఆయనకి భాగస్వామ్యం ఉంది. అవసరం లేకపోయినా రక్త, మూత్ర పరీక్షలు కోరుతుంటాడు. తద్వార ఆ లేబరేటరీకి ఆదాయం పెరుగుతుంటుంది.

బెనర్జీ వచ్చేసరికి దేవ్‌సేన్ ఓ పేషెంట్‌ని అదరగొడుతున్నాడు.

"కుడివైపా కడుపునొప్పి వచ్చేది?"

"కాదండి. ఎడం వైపు"

"తరచు తలనొప్పి కూడా వస్తూంటుందా?"

"అవునండి"

"ఈ మధ్య నీరసంగా ఉంటోందా?"

"అవునండి"

"ఆకలి మందగించిందా?"

"కొద్దిగా"

స్టెతస్కోప్‌తో సీరియస్‌గా ఆ పేషెంట్ గుండెని పరీక్షించాడు. డాక్టర్ మంచి నటుడయి ఉండాలి అన్న అనవసరం అతని మొహాన్ని అప్పుడు చూస్తే నిజం తెలిసిన వారు ఇట్టే గ్రహించగలరు.

"అప్పుడప్పుడు పొడి దగ్గు వస్తుంటుందా?"

"వస్తూనే ఉంటుంది. తుమ్ములు కూడా"

మరోసారి దేవ్‌సేన్ ఆ పేషెంట్ ఇచ్చిన బ్లడ్, యూరిన్ రిపోర్ట్‌లని చూసి చెప్పాడు.

"మీ వంశంలో ఎవరికయినా మధు మేహం గాని, రక్తపోటు వ్యాధిగానీ ఉందా?"

"మా బాబాయ్‌కి ఉండేదండి"

"అయితే అన్నీ కరెక్ట్‌గా సరిపోయాయి"

"ఏం సరిపోయాయండి?"

"వ్యాధి లక్షణాలు"

"ఏం వ్యాధండి ఇది?"

జవాబు చెప్పకుండా తల పంకించాడు దేవ్‌సేన్.

"అయిదారు వేల దాకా ఖర్చయ్యే జబ్బిది. మీకు ఆపరేషన్ అవసరం"

"ఆపరేషనే?" ఆదుర్దాగా అడిగాడాయన.

"మీ అదృష్టం బావుండి నా దగ్గరకి వచ్చారు. ఇది ఓ పట్టాన అంతా కనుక్కోగలిగే జబ్బు కాదు. మీకు మారేడ్‌పల్లి తెలుసా?"

"తెలుసండి"

"డాక్టర్ శతభిషం హాస్పిటల్ తెలుసా?"

"తెలీదండి"

"అడ్రస్ చెపుతాను. నేరాసిచ్చే కాగితాన్ని ఆయన దగ్గరకి తీసుకెళ్ళి చూపించండి. ఆయన బెస్ట్ సర్జన్. మీకు ఆపరేషన్ చేస్తారు. అదీ వారం రోజుల్లో చేయించుకోవాలి. ఆలస్యం అయితే ప్రాణానికే ముప్పు"

తన లెటర్ హెడ్ మీద గబగబ ఏదో రాసి, రిపోర్టులు జతచేసి ఆయన కిచ్చి చెప్పాడు దేవ్‌సేన్.

"రేపే వెళ్ళండి. ఉదయం తొమ్మిదిలోగా దొరుకుతారు"

ఆయన లేచి వెళ్ళాక దేవ్‌సేన్ బెనర్జీ వంక చూసి నవ్వి రిసీవర్ అందుకుని ఓ నెంబరు తిప్పాడు.

" హలో.. డాక్టర్ శతభిషం?" అడిగాడు.

అవతల నుంచి జవాబు విన్నాక చెప్పాడు.

"త్రిశూల్ ధర్ అనే పేషెంట్ రేపు ఉదయం మీ దగ్గరకి వస్తాడు. షరా మామూలే. నా వంతు డబ్బు నాకు పంపండి. మార్గదర్శి చిట్‌ఫండ్‌కి ఈ నెల ఇన్‌స్టాల్ మెంట్ కట్టలేదు. కాబట్టి రెండు మూడు రోజుల్లో పంపగలిగితే మంచిది"

అవతలివైపు వాళ్ళు చెప్పేది విని డాక్టర్ దేవ్‌సేన్ పెద్దగా నవ్వి చెప్పాడు.

"నేను మేనేజ్ చేసాను. మీరు చేయండి. ఓసారి కడుపు కోసి, లోలోపల కనబడ్డ వాటితో హలో చెప్పి మళ్ళీ కుట్టేయండి. మీకు తెలీందేముంది?"

"...."

"థాంక్ యూ"

లైన్ కట్ చేసి మళ్ళీ ఓ నెంబర్ తిప్పి ఓ ఎనస్థీషియన్‌తో మాట్లాడాడు. ఆ ఆపరేషన్‌కి ఆయన వెళ్ళి పేషెంట్‌కి మత్తుమందు ఇవ్వాలి. అందుకు ఆయనకి ముట్టే రుసుములో తన కమిషన్ తనకి పంపమని చెప్పి ఫోన్ పెట్టేసాడు.

"అయితే ఆ పేషెంట్‌కి నిజంగా ఆపరేషన్ అవసరంలేదా?" అడిగాడు బెనర్జీ ఆశ్చర్యంగా.

"లేదు"

"మరయితే పాపం..."

"ఆగాగు. ఎవరి వృత్తి మెళకువలు వారివి. అందరూ సంపాదించాలి కదా. కొందరు సర్జన్స్ చేత ఆపరేషన్స్ చేయించుకోడానికి పేషెంట్స్ క్యూలో ఉంటే, మరి కొందరికి అసలు వారానికో పేషెంట్ దొరకడు. అలాంటివి వాళ్ళకోసం తప్పవు మరి" నవ్వాడు దేవ్‌సేన్.

"నువ్వన్నట్లు ఎవరి వృత్తి మెళుకువలు వారివి" చెప్పాడు బెనర్జీ.

"ఏమిటి విశేషం? మళ్ళీ ఎక్కడయినా చింతాకు అంటించుకుని వచ్చావా?" అడిగాడు డాక్టర్ దేవ్‌సేన్.

"అబే! అలాంటిఏం లేదు. నీతో నాకు ఇంకో అవసరం వచ్చింది"

"ఏమిటి? మళ్ళీ ఎవర్నయినా ప్రెగ్నంట్ చేసావా?"

"అదికాదు"

"ఈ రెండూ కాకపోతే నేనసలు ఎందుకు గుర్తొచ్చాను నీకు?" నవ్వుతూ అడిగాడు డాక్ట దేవ్‌సేన్.

గట్టిగా ఊపిరి పీల్చుకుని వదిలాడు బెనర్జీ. జేబులోంచి తన మెడికల్ రిపోర్ట్‌కి సంబంధించిన కాగితాన్ని తీసి దేవ్‌సేన్ కిచ్చి మౌనంగా ఉండిపోయాడు.

అతను దాన్ని చదివి, పైన బెనర్జీ పేరు ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు.

"ఇది నీదా?" అడిగాడు.

తలూపాడు బెనర్జీ.

"ఇంపాజిబుల్. ఇదెలా సాధ్యం?"

"అదే నాకూ అర్థం కావడం లేదు. అంతా అయోమయంగా ఉంది. నీ దగ్గరకి వచ్చాను.

"అసలీ పరీక్ష ఎందుకు చేయించుకున్నట్లు?" అడిగాడు దేవ్‌సేన్.

దాని పూర్వాపరాలు చెప్పాడు బెనర్జీ.

"మరోసారి పరీక్షించి నువ్వు నిర్ధారణ చెయ్యాలి"

"తప్పకుండా. మా లేబ్‌లో నా పార్టనర్‌ని స్వయంగా పరీక్ష జరపమంటాను"

బెనర్జీ వెళుతూ చెప్పాడు.

"రిజల్ట్ ఏదయినా సరే ఆ సంగతి రహస్యంగా ఉంచాల్సిన బాధ్యత నీ మీద ఉందని వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను."

"నాకు వృత్తి ద్రోహం తప్ప మిత్రద్రోహం తెలీదు మిత్రమా!" చెప్పాడు డాక్టర్ దేవ్‌సేన్ నవ్వి.

"అయితే రేపు సాయంత్రం ఈ టైంకి వస్తాను."

డాక్టర్ దేవ్‌సేన్ భార్య సౌగంధి రావడంతో ఆమెని పలకరించి వెళ్ళిపోయాడు బెనర్జీ.

ఆ రాత్రి బెనర్జీ యధాప్రకారం విశ్వంతో మందు కొడుతుండగా విశ్వం గుర్తొచ్చి అడిగాడు.

"అన్నట్లు మీ మెడికల్ రిపోర్ట్ ఏమైంది"

"మా ఆవిడలో ఎలాంటి లోపం లేదని తేలింది" చెప్పాడు బెనర్జీ.

"గుడ్! నీది?"

"నా రిపోర్ట్ మీద నీకెలాంటి అనుమానాలయినా ఉన్నాయా?" నవ్వుతూ అడిగాడు బెనర్జీ.

"అబ్బే లేదు"

"ఎవ్విరి థింగ్ ఈజ్ పర్ఫెక్ట్లీ ఆల్‌రైట్" అబద్ధం చెప్పాడు బెనర్జీ.

## 5

అశోక్ నగర్ లోని పి అండ్ టి క్వార్టర్స్‌లోని ఓ క్వార్టర్ అంది. ఆ క్వార్టర్ ముందో సైకిల్ ఆగింది. దాన్ని మెట్లపక్కన లాక్ చేసి ఆ ముసలాయన మెట్లెక్కి మొదటి అంతస్తులోని తన క్వార్టర్ ముందాగి కాలింగ్ బెల్ నొక్కాడు. ఆ క్వార్టర్ తలుపు మీద 'కైలాసం, బి.ఏ' అని తెల్లరంగులో రాసి ఉంది. అది రాసి చాలా సంవత్సరాలవటంతో అక్షరాలు బాగా మాసిపోయి ఉన్నాయి.

తలుపు తెరుచుకుంది. కైలాసం కన్నా ఆరేళ్ళు చిన్నదయిన ఓ ముసలావిడ తలుపు తెరిచింది. ఆవిడకి కూడా ఆయనకి లాగే కళ్ళజోడు. ఆవిడ పేరు శ్యామలాంబ. ఆయన భార్య.

ఆయన లోపలకి రాగానే వంట గదిలోని కూజాలోంచి ఓ ఇత్తడి గ్లాసునిండా నీళ్ళు తీసుకెళ్ళి తన భర్తకిచ్చింది శ్యామలాంబ.

"అమ్మాయి ఆఫీసు నుంచి ఇంకా వచ్చినట్లులేదు?" అడిగాడాయన గొళ్ళెం పెట్టివున్న గదివంక చూసి.

"రాలేదు. వచ్చే టైం అయింది" చెప్పింది శ్యామలాంబ. కాలింగ్ బెల్ మోగింది.

ఆయన వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా మైత్రి.

"నీకు నిండా నూరేళ్ళు. ఇప్పుడే నీ గురించే అనుకుంటున్నాం" చెప్పింది శ్యామలాంబ మైత్రివంక వాత్సల్యంగా చూస్తూ.

మైత్రి చిన్నగా నవ్వి శ్యామలాంబతో చెప్పింది.

"తోటకూర విత్తనాలు తెచ్చాను ఇరవై రోజుల్లో కోతకి వస్తుంది. కాస్త కాఫీ ఇస్తే తాగి వాటిని చల్లుతాను. అన్నట్లు సుధీర్ వచ్చాడా?" అడిగింది.

"ఇంకాలేదు."

మైత్రి కాఫీతాగి, మొహం కడుక్కుని బట్టలు మార్చుకుంది. అట్లకాడ, బక్కెట్ తీసుకుని కిందకి వెళ్ళింది. ఆమె వెంటే వెళ్ళింది శ్యామలాంబ కూడా. బక్కెట్‌లోని నీళ్ళని దడికట్టివున్న కాంపౌండ్‌లో చల్లి అట్లకాడని వెనక్కి తిప్పి నేలని తవ్వింది. చిన్న కాగితం పొట్లాన్ని విప్పి అందులోంచి నల్లటి తోటకూర విత్తనాలని చల్లి మట్టిని కలిపింది. ఆ మట్టిపైన మగ్‌తో నీళ్ళు చల్లింది.

ఓ మూల పాతివున్న తీగబచ్చలి దగ్గరకి వెళ్ళి చూసింది.

శ్యామలాంబ చెప్పింది. "వారంలో కొద్దిగా పెరిగింది."

"బెండమొక్కలు వస్తున్నట్లున్నాయే" చెప్పింది మైత్రి ఆనందంగా ఓ మూల మడిలోని మొలకలని చూసి.

"అవును" పరీక్షగా చూసి శ్యామలాంబ కూడా చెప్పింది.

"రేపు మిర్చి విత్తనాలు చల్లుతాను. మొలక వచ్చాక వాటిని మేడమీద మట్టి తొట్లలో పెడదాం బాత్ రూం పక్కన ఉంచితే గ్రిల్‌లోంచి ఎండ తగులుతుంది. మీరు వంటకి తాజాగా కోసుకోవచ్చు."

"ఎంత శ్రద్ధమ్మా నీకు మొక్కలంటే" మనస్ఫూర్తిగా చెప్పింది శ్యామలాంబ.

"చిన్నప్పటినుంచి తోటపని అంటే ఎంతో ఇంట్రెస్ట్ మామ్మగారూ! మా నాన్నగారికి గార్డెనింగ్ అంటే మక్కువ. పదిపైసల కరివేపాకు కోసం పావుమైలు స్కూటరు మీద వెళతారు కానీ ఈ హైదరాబాదులో ఇంట్లో మొక్కలు పెంచుకోవాలని ఎందుకనుకోరో" చెప్పింది మైత్రి.

"అసలంత నేల ఎక్కడ ఉండి చచ్చింది? అంగుళం వదలకుండా ఇళ్ళు, కొట్లు వేసి అద్దెకి ఇచ్చేస్తున్నారు."

"ఓ వెయ్యిగజాల స్థలం మధ్య చిన్న కుటీరం లాంటిది వేసుకుని, మిగతా స్థలంలో కూరగాయలు, పూలమొక్కలు వేసుకుని, బెజవాడ దగ్గర గన్నవరంలోనో, గుంటూరు దగ్గర చేబ్రోలులోనో ఉండాలన్నది నా కోరిక మామ్మగారూ! ఎలాంటి బాదరబందీ లేకుండా ఆ మొక్కలని చూసుకుంటూ, రెండు గేదలతో ప్రశాంతంగా జీవించచ్చు."

శ్యామలాంబ మైత్రివంక చూసి నవ్వి చెప్పింది.

"ఈ కాలం పిల్లవి కాదు మైత్రీ నువ్వు. నీ ఈడువాళ్ళు బాంబేలోనో, లండన్‌లోనో ఉండాలనుకుంటారు. పద. ఉప్మా చేస్తాను."

"అన్నట్లు నీకో ఉత్తరం వచ్చిందమ్మా!" చెప్పాడు కైలాసం పైనుంచి.

వెంటనే మైత్రి మొహంలో చిన్న వెలుగు. ఇద్దరూ పైకెళ్ళారు. శ్యామలాంబ ఆ కవరు మైత్రికి ఇచ్చింది. మైత్రి తన గదిలోకివెళ్ళి, మంచం మీద దిండుని గోడకి అడ్జస్ట్ చేసి, దానిమీద తల పెట్టుకుని పడుకుని ఎంతో సంతోషంగా ఆ కవరుని చింపి, అందులోంచి మడతలు పెట్టిన ఉత్తరాన్ని బయటకి తీసింది. మడతలు విప్పబోయే ముందు ఓసారి ఆ ఉత్తరాన్ని వాసన చూసింది. గులాబి రంగు సెంట్ వాసన వేసింది.

తర్వాత ఉత్తరం విప్పి చదవసాగింది. ఆత్రంగా పరిగెత్తాయి మైత్రి కళ్ళు ఆ తెల్లటి కాగితంలోని నల్లని అక్షరాల వెంట.

✷✷✷

బెనర్జీ, అనసూయలకి ఫర్టిలిటీ పరీక్ష జరిగి, రిజల్టు వచ్చినప్పటి నించి ఓ విధమయిన గంభీరత ఏర్పడింది అనసూయకి. ఇదివరకటిలా భర్తని సిగరెట్స్ విషయంలోగాని, మందు విషయంలో గాని మానమని ఎత్తిపొడవటంలాంటి మాటలు మాట్లాడటం లేదు. ఆ రిజల్టు వచ్చి రెండు రోజులు గడవకపోయినా బెనర్జీ ఈ మార్పుని గుర్తించాడు.

ఆ రోజు ఉదయం అతను ఆఫీస్‌కి బయలుదేరుతూ బ్రేక్ ఫాస్ట్‌కి మునుపు రెండు పెగ్గులు తాగినా అనసూయ అభ్యంతరం చెప్పలేదు. ఆ రిపోర్ట్‌లో నిజం ఉందని, తనకి పిల్లలు పుట్టే అవకాశం లేదని అనసూయ ఓ నిశ్చయానికి వచ్చిందని గ్రహించాడు బెనర్జీ.

మనసులోనే నవ్వుకున్నాడు. తను ధృతరాష్ట్రుడ్ని మించిపోయి ఉండేవాడు, జాగ్రత్తలు తీసుకోకపోతే. ఆ సంగతి అనసూయకి తెలీదు. తను చెప్పలేదు.

బెనర్జీలో ఎలాంటి మార్పు లేదు. ఎప్పటిలా హుషారుగానే ఉన్నాడు.

"సాయంత్రం సినిమాకి వెళదామా?" అడిగాడు భార్యని.

"మీ ఇష్టం! వచ్చేముందు ఫోన్ చేయండి."

ఆఫీసుకి వెళుతూ చిన్నగా ఈల వేయసాగాడు, మైత్రిని ఎలా లొంగదీసుకోవాలా అని ఆలోచిస్తూ. మొదటిసారి లొంగదీయడానికే ఎంతో కష్టపడాల్సి వచ్చింది. తను మోసగాడని అర్థం అయాక రెండోసారి చాలా కష్టం. అయినా సరే. తన ప్రయత్నం తను చేయాలి ఈసారి ఎలా?

బెనర్జీకి మొట్టమొదటిసారిగా తను మైత్రిని చూసిన సంఘటన గుర్తుకు వచ్చింది. ఆ తర్వాత ఆ ఆదివారం దాకా జరిగిన అనేక సంఘటనలని నెమరువేసుకోసాగాడు.

✷✷✷

ఎనిమిదేళ్ళ క్రితం ఓ రోజు...

"సాయంత్రం బోర్డ్ మీటింగ్ ఉంది. నువ్వూ రారాదూ" అడిగాడు బెనర్జీ తండ్రి.

"ఈ సాయంత్రం ఫ్రెండ్స్‌తో ఫ్లవర్ షోకి వెళ్ళాలనుకుంటున్నాను నాన్నగారు!" చెప్పాడు బెనర్జీ ఇబ్బందిగా చూస్తూ.

"నీ సరదాల్ని కాదనను. కాని నా తర్వాత నా వ్యాపారం చూడాల్సింది నువ్వేకదా! ఇప్పటినుంచే నేర్చుకోకపోతే ఎలా?" ఆయన కొడుకుని మృదువుగా కోప్పడ్డాడు.

"అది నిజమే అనుకోండి. ఈ ఒక్క సాయంత్రం..."

ఆయన కొడుకుని ఎగాదిగా చూసి చెప్పారు.

"సరే! రేపటి నుంచి నువ్వూ ఇక నాతో ఆఫీస్‌కి రావాలి. వ్యాపారాన్ని ఆకళింపు చేసుకోవడం ఏదో ఓ రోజు ప్రారంభించాలి. మేకిట్ టుమారో"

బెనర్జీ ఆ ఫ్లవర్ షో చూడటానికి వెళ్ళాలనుకోడానికి కారణం అతనికి పువ్వులంటే ఆసక్తి ఉండి కాదు. దాన్ని ప్రారంభించటానికి వచ్చే లయన్స్ ప్రెసిడెంట్ భార్య చాలా అందంగా ఉంటుందని విని ఉండటం చేత. వీలయితే పరిచయం చేసుకోవాలని.

సాయంత్రం విశ్వం బెనర్జీ ఇంటికి వచ్చాడు. ఇద్దరూ కలిసి అతని కార్లో ఇందిరా పార్క్ చేరుకున్నారు. దాదాపు ఏభైమందిదాకా ఉన్నారు. ఆమె మాట్లాడుతోంది.

"సాధారణంగా ఇలాంటి ఫ్లవర్ షోలని ఆడిటోరియంలో ఏర్పాటు చేస్తుంటారు. నా కనిపించింది ఆ కాంక్రీటు సీలింగ్ కింద ఇటుక గోడల మధ్య, పిట్టల మధ్య ఎందుకు ఏర్పాటు చేయకూడదని. పువ్వులు దేవుడు మనకిచ్చిన వరాలు. అవి లేకపోతే ఈ లోకం ఎలా ఉండేదో ఒక్కసారి ఊహించండి. ఇన్ని అందమయిన రంగులని, రూపాలని, సువాసనలని మనం కోల్పోయి ఉండేవాళ్ళంకదా... "

బెనర్జీ ఆ ప్రౌఢ అందాలని గమనిస్తూ వింటున్నాడు. ఆవిడలోని హుందాతనం, చదువువల్ల మొహంలోని సంస్కారం, ఎదుటి వాళ్ళమీద తనకి ఆధిక్యత ఉంది అనిపించే గాంభీర్యంవల్ల అతను ఆవిడ గురించి చెడ్డగా ఎక్కువసేపు ఆలోచించలేకపోయాడు. ఆవిడ స్పీచ్ అయాక ఫ్లవర్ షోకి వచ్చిన ఎంట్రీలని పరిశీలించసాగారు జడ్జీలు. చాలామంది ఆడవాళ్ళు వచ్చారు.

అందరిలోకి బెనర్జీని అధికంగా ఆకర్షించింది కాఫీ కలర్ ఆర్గండీ చీరకట్టుకున్న ఓ అమ్మాయి. చెంపలు ఎంతో నున్నగా, ఎంతో పలచగా ఉన్నాయి. ఆమె మొహంలో అమాయకత్వం స్పష్టంగా కనపడుతోంది. మనిషి కొద్దిగా నల్లగా ఉన్న విగ్రహం, మొహం ఎంతో అందంగా ఉన్నాయి.

ఆమె కూడా ఆ ఫ్లవర్ షోలో పాల్గొనడానికి వచ్చింది. ఆమె తెచ్చిన ఫ్లవర్ కాంబినేషన్‌కి కన్సొలేషన్ బహుమతి ఇచ్చారు జడ్జీలు. ఆమె పేరు మైత్రిగా గ్రహించాడు.

"హలో. కంగ్రాట్స్" పలకరించాడు బెనర్జీ ఆమెని.

"థాంక్స్. మీరు..?" ప్రశ్నార్థకంగా చూసింది.

"నా పేరు బెనర్జీ. నాకు పువ్వులన్నా, వాటి రంగులన్నా, అవి అందించే సువాసనలన్నా ఎంతో ఇష్టం. అందుకనే వచ్చాను మీ ఫ్లవర్ కాంబినేషన్ నాకు బావుంది. ఆరెంజ్ రంగు, తెల్ల రంగు గులాబీలు, సెరన్ మొక్క ఆకులతో ఎంత అందంగా ఆ కాంబినేషన్‌ని తయారుచేసారు"

"థాంక్స్ అగైన్" మొడెస్టీతో కూడిన సిగ్గుతో చెప్పింది.

"మీ పేరులా మీరూ స్నేహంగానే ఉండేవాళ్ళనిపిస్తోంది"

మళ్ళీ సిగ్గుపడింది ఇరవై ఒకటిన్నర ఏళ్ళ మైత్రి.

"మీరుండేది ఎక్కడ?"

"చిలకలగూడ క్వార్టర్స్‌లో"

"మీరింటికేనా వెళ్ళేది?"

"అవును"

"మీ కభ్యంతరం లేకపోతే నేను డ్రాప్ చేస్తాను. అటే నేను వెళ్ళేది. బైదిబై ఇతను నా బెస్ట్ ఫ్రెండ్ విశ్వం."

"నమస్తే" చెప్పింది మైత్రి రెండు చేతులు జోడించి.

"నమస్తే" బదులుగా చెప్పాడు విశ్వనాథరావు.

బెనర్జీ తన ఫియట్ కారువైపు నడిచాడు. మైత్రి వెనకాల సీట్‌లో ఓ మూల మొగ్గలా ఒదిగి కూర్చుంది. విశ్వం కారుని నడుపుతుంటే ఆమె పక్కన ఇవతలివైపు కిటికీ దగ్గర కూర్చున్నాడు బెనర్జీ.

"మీకు వీటిమీద ఆసక్తి ఎలా కలిగింది?" అడిగాడు బెనర్జీ కాసేపయాక.

"నాకు గార్డెనింగ్ అంటే చిన్నప్పటినుంచే ఇష్టం"

"ఘంటసాల పుష్ప విలాపం విన్నప్పట్నుంచీ నాకు పువ్వులంటే ఇష్టం. ఐ సింప్లీ లవ్ దెమ్"

మైత్రి బదులు మాట్లాడలేదు.

"మీరు బాగా ఎమోషనల్ టైప్ అనుకుంటా?" అంతదాకా మౌనంగా ఉన్న విశ్వం మైత్రిని ప్రశ్నించాడు.

"ఎందుకలా అనుకున్నారు" అడిగింది మైత్రి.

"మా వాడికి అలాంటివాళ్ళంటే ఇష్టం. వాడు అదే టైప్ కాబట్టి. ఈ కాలం కుర్రాళ్ళు ఫ్లవర్ షోలకి వెళతారంటండీ? సాయంత్రాలు ఏ టాంక్ బండ్‌కో, సినిమాకో వెళ్ళాలనుకుంటారు కాని"

"నిజమేనండి. ప్రకృతి అంటే నాకెంతో ఆరాధన. జూ పార్క్‌లో జంతువులని చూస్తూ మైమరచిపోతాను. ఇందిరా పార్క్‌లో పువ్వులని చూసినా అదే మైమరుపు కలుగుతుంది. సముద్ర కెరటాలన్నా, ఇంద్రధనస్సన్నా, పండు వెన్నెలన్నా నాకెంతో ఇష్టం" చెప్పాడు బెనర్జీ.

"ఇక్కడ ఆపితే దిగిపోతాను" చెప్పింది మైత్రి, కారు చిలకల గూడా చౌరస్తా చేరగానే.

"ఇంటిదాకా వస్తాంలెండి" చెప్పాడు విశ్వం.

"వద్దండి"

కారు ఆపాడు విశ్వం. మైత్రి తలుపు తెరవడానికి ప్రయత్నించింది కాని, కారు ఎక్కే అలవాటు లేనందువల్ల తెరవలేకపోయింది. బెనర్జీ కారు దిగి తిరిగి వెళ్ళి బయటనుంచి తలుపు తీసాడు.

"చాలా థాంక్సండి" చెప్పింది దిగి.

"మనం మళ్ళీ ఇంకోసారి కలవాలి"

"ఎందుకు?" అడిగింది మైత్రి.

"అలా అనిపిస్తోంది కాబట్టి"

మైత్రి కొన్ని క్షణాలు ఆలోచించింది. తనకున్నలాంటి భావాలే అతనికీ ఉన్నాయి. కానీ అంతదాకా తను ఏ మగవాడితో స్నేహం చేయలేదు. ఇప్పుడెందుకు? అందులో ధనవంతులతో" "సారీ అండి"

"ఫర్వాలేదు. వి కెన్ ఎక్స్చేంజ్ అవర్ ఐడియాస్. నల్ల గులాబిని ఎప్పుడయినా చూసారా? రేరెస్ట్ కదా. చీకటిలా నల్లగా ఉండే గులాబి చెట్టు మీకు ప్రజెంట్ చేద్దామనుకుంటున్నాను. కాశ్మీర్ నుంచి తెప్పించాం"

"నాన్నగారికి తెలిస్తే కోప్పడతారు. బాధపడతారు. ఐయామ్ సారీ."

బెనర్జీ ఇంకేదో చెప్పబోతుంటే మైత్రి "థాంక్స్ అగైన్ ఫర్ ఎవ్విరి థింగ్" అని గబగబ అడుగులు వేసింది.

"కూర్చోరా. పిట్ట వల్లో పడలేదు" చెప్పాడు విశ్వం ఆమె దూరం అయాక.

వలెంత గట్టిదో పిట్టకూడా అంత గట్టిది. ఖచ్చితంగా కన్యే అనిపించింది. "బేడ్ లక్"కారులో విశ్వం పక్కన కూర్చుని చెప్పాడు బెనర్జీ.

కారు స్టార్ట్ చేసి విశ్వం వెనక్కి తిప్పాడు. మైత్రి గురించి అంతటితో మరిచిపోయారిద్దరు.

కాని త్వరలోనే మైత్రి బెనర్జీకి రెండోసారి తారసపడింది.

*(ఇంకా ఉంది)*

✷✷✷

Post your comments